
# ప్రేమ ఖరీదు

— శ్రీసుభా




మూర్తి భయపడలేదు. పార్కుకి ఒంటరిగానే వెళ్ళాడు. అప్పటికే చీకటిపడ్డం మూలంగా చుట్టుప్రక్కల జనంలేరు. దూరంగా అక్కడక్కడా ఒకళ్ళూ ఇద్దరూ-అంతే! ఎక్కడి నుంచో సంగీతం గాలిలో తేలి వుండుండి విన్పిస్తోంది.

సుందరం గారు తన గుమస్తా చేత కబురు పంపించాడు యింటికి. దాని సారాంశం మొత్తం - 'సార్ సాయంత్రం నీతో మాట్లాడాలిట. పార్కుకి రమ్మన్నా'రని.

'ఏం మాట్లాడాలిట?' అని మూర్తి అడగలేదు. కారణం మూర్తికి తెలిసిందే! ఇలాంటి పరి



కథా నిలయం
శ్రీకాకుళం

ణామాన్ని ఏదో రోజు ఎదుర్కోవల్సి వుంటుందని ముందే ఊహించాడు. రాణితో స్నేహం మొదలుపెట్టిన తర్వాత, ఆ స్నేహం రోజులూ, నెలలూ దాటి సంవత్సర ప్రాయంలో అడుగుపెట్టింది.

ఓ రోజు రాణి అననే అంది- "మన స్నేహం నాన్నకి యిష్టం ఉండదు."

మూర్తి నవ్వేశాడు.

"మా నాన్న బెదిరిస్తే ఏం చేస్తావ్?" కుతూహలంగా అడిగింది చెవులకున్న జూకాలు ముచ్చటగా ఊపుకుంటూ.

"బెదిరించనీ చూద్దాం." రాణీ వైపు చూశాడు.

రాణీ కళ్ళల్లో, మాటల్లో, మాటల వెనక మసకగా తొంగి చూసే మనసు అతను ఎంతకాదనుకున్నా అర్థమవుతూనే ఉంది.

"నాకు ఉద్యోగం దొరికితే, నేను దేనికీ, ఎవరికీ భయపడను.

కానీ ఈ నిరుద్యోగిని ప్రేమించి- ఈ వెన్నెముక లేని మనిషి ఆసరా చూసుకొని నువ్వు ఆకాశంలో ఊహల ఉయ్యాల ఊగుతున్నావ్!" అనాలనుకున్నాడు మూర్తి.

కానీ రాణీ మాట్లాడనివ్వలేదు. తనే ఏవేవో చెప్తుంది, ఏవేవో చెయ్యమంటుంది.

మూర్తికి అప్పుడప్పుడు ఆత్మ జ్ఞానం లాంటిది ఏదో మనసులో మెదుల్తుంది. రాణీని తను నిజంగా ప్రేమించాడా? రాణీతో స్నేహం ఎందుకు చేసినట్టు? రాణి తండ్రి తల్చుకుంటే తనకు ఉద్యోగం ఇప్పించగలడు. జీవితాన్ని ఓ కొలిక్కి తేగలడు. కానీ జరిగింది వేరు. రాణీ తన చెయ్యి పుచ్చుకుని నడవమంటుంది. చేతిలో చెయ్యి వేయమంటుంది, ప్రమాణం చెయ్యమంటుంది.

వాటన్నిటినీ తను నవ్వుతో కొట్టి పారేశేవాడు. కానీ జీవితం నవ్వుల రథంకాదు. అది అవిటి పడవ. చిన్నగాలి - అతి చిన్న చినుకు కూడా అవిటిపడవ పాలిట శాపమే!

అంతె అయ్యింది. సుందరం గారు రావొచ్చు - వచ్చి ఏవన్నా మాట్లాడొచ్చు. బెదిరించ వచ్చు. రెండువేలు సంపాదించే ఉద్యోగి, సంఘంలో పరపతి ఉన్న మనిషి, ఓ నిరుద్యోగిని-అందునా కూతుర్ని వలలో వేసుకున్న మనిషిని రెడ్ కార్పెట్ పరిచి ఆహ్వాన గీతాలు పాడడు. చండ ప్రచండంగా కాదు, ఝంఝామారుత మవుతాడు.

సుందరంగారు వచ్చాడు. అదీ నల్ల ఎంబాసిడర్‌లో. వచ్చీరావడం తోనే పక్కనే ఉన్న బెంచీలో కూలబడి మూర్తినీ, మూర్తి వంశాన్నీ పరామర్శించాడు. మూర్తి తాహతుని తలపంకిస్తూ లెఖ్ఖలు కట్టాడు. మాటల మధ్యలో కళ్ళ జోడు తీసి జేబురుమాలుతో మొహం తుడుచుకుని తిరిగి కళ్ళ జోడు పెట్టుకుంటూ అనేశాడు —

"నువ్వు మా రాణినీ ప్రేమించావంటే నేను నమ్మను."

మూర్తి నవ్వేశాడు.

"నిజమేనా?"

మూర్తి మామూలుగా అన్నాడు- "నేను నిజం చెప్పనని మీకో నమ్మకంలా వుంది చూస్తే. పైగా నేను చెప్పేదానికల్లా అబద్ధం రంగు పులమాలని మీరు గట్టి నిర్ణయానికే వచ్చి ఉంటారు."

"నీది అతితెలివి."

"అవునేమో!"

"నేను మీ ఇద్దరికీ పెళ్ళి చెయ్యడం అనేది కల్ల. రాణీని

మర్చిపో. నీకేం కావాలంటే అది ఇస్తాను. డబ్బా? అయితే ఎంతో చెప్పు?"

"నన్ను కొంటారన్నమాట!"

సుందరం జవాబుగా నవ్వే డు.

"అయితే చెప్తున్నాను వినండి- నేను నిరుద్యోగిని. నేను బ్రతకాలన్నా, నా కుటుంబం బట్ట కట్టి బయటపడాలన్నా నాకో ఉద్యోగం కావాలి. మీ ఆఫీసులో ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని నాకు తెలుసు. నాకో ఉద్యోగం ఇవ్వండి. అంతే! నేను మీ దారికి రాను,"

"మాట తప్పవుగా?"

"తప్పను."

సుందరంగారు చీకట్లోకి అనుమానంగా చూశాడు.

"అంటే నీ ప్రేమ ఖరీదు ఒక చిన్న ఉద్యోగం అన్నమాట! నీ లాంటి వాడికి మనసిచ్చి మా రాణీ ఎంత తప్పిదం చేసిందో చూడు ...." ఆయన ఆగి తిరిగి ప్రశ్నించాడు— "నువ్వు నిజంగా రాణీని ప్రేమించలేదా?"

మూర్తి చిన్నగా నవ్వాడు.

"నేను నిజం చెప్తున్నాను. రాణి మీ బిడ్డ అని తెలుసు. రాణీ ద్వారా నేను తేలిగ్గా ఉద్యోగం సంపాదించగలననీ తెలుసు. అందుకే రాణీతో స్నేహంచేశాను. ఇప్పుడు నేను రాణీని గాఢంగా ప్రేమించానా, ఉద్యోగం కోసం నా ప్రేమని త్యాగం చేస్తున్నానా అన్నది వ్యర్థ ప్రశ్న. కూతురు మనసు అర్థంచేసుకోవడం యిష్టం లేని మీరు, ఆమె ప్రేమని ఖాతరు చెయ్యని మీరు, వ్యాపారస్తులుగా నా ముందుకొచ్చి బేరం చేస్తున్నారు. అలాంటి మీ ముందు నేనూ వ్యాపారస్తుడిగానే ప్రవర్తించాలి గానీ, నా మనస్సుని శోధించుకుని దాన్ని మధించి మీకు జవాబివ్వవల్సిన అవసరం లేదేమో! మీ ఆఫీసుకు ఎప్పుడు రమ్మంటారో చెప్పండి-చాలు."

సుందరంగారు తీక్షణంగా ఆలోచించాడు. ఆయన మూర్తి తనతో బేటీ వేసుకుంటాడనీ, మొండి రకంగా ఎదురు ప్రశ్నలు వేస్తాడనీ, రాణీ తండ్రిగా తనని సవాల్ చేసి యక్షప్రశ్నలు వేస్తాడనీ అనుకున్నాడు. నిముషాల మీద మూర్తి తన దారిలోకి రావడం ఆయనకి ఆశ్చర్యంగానూ, అంతకు మించి అనుమానంగానూ, ఆ పై భయంగానూ కూడా అన్పించింది.

"ఉద్యోగం ఆర్డర్స్ నీ చేతిలో పడాలంటే నువ్వో పని చెయ్యాలి. రాణీని నువ్వు కల్సుకో- దాన్ని

సముదాయించు ఓదార్పు-నీ యిష్టం. అది నేతెచ్చిన సంబంధానికి ఒప్పుకున్ననాడే నీకు ఉద్యోగం ఇస్తాను. అప్పుడే నిన్ను నమ్ముతాను. ఏమంటావ్?"

మూర్తి వింతగా సుందరాన్ని చూశాడు.

"మీ అమ్మాయి ఒప్పుకోకపోతే?"

"నీకే నష్టం."

"అయితే రాణీ నన్ను తప్ప మరెవర్నీ పెళ్ళి చేసుకోనని మొండికేసేటంత గాఢంగా నన్ను ప్రేమించిందనా మీ అనుమానం?"

సుందరంగారికి జవాబు చెప్పాలని ఉన్నా నోరు పెగలలేదు. తన జవాబు తనకే అవమానకరంగా తిరిగివచ్చి తగుల్తుందని ఆయనకు తెలుసు. ఉక్రోషంతో మండిపడుతూ మూర్తిని చూసి—

"నువ్వో గొప్ప ప్రేమికుడవని నేను తల వంచుకుంటాననుకోకు. స్వార్థపరుల విరాట్ రూపం రాణీకి తెలియాలి. అందుకనీ-తెలిసిందా?"

"ఓ - అలానా!" అన్నాడు మూర్తి.

"చెప్పింది గుర్తుంచుకో-వెడుతున్నాను."

నల్ల ఎంబాసిడర్ కారు చీకటిని చేధించుకుంటూ హెడ్ లైట్ల కళ్ళజోడు తగిలించుకుని నడక వేగం హెచ్చించింది.

* * *

పబ్లిక్ గార్డెన్‌లో కూర్చోబెట్టి మూర్తి,తనకీ సుందరంగారికీ మధ్య జరిగిన కథంతా చెప్పాడు, రాణీతో.

రాణీ ఎదిగీ ఎదగని చిరుగడ్డి తెంపుతోంది. ఆమె తల వంచుకునే ఉంది అంతవరకూ.

"ఇప్పుడు స్నేహితునిగా నిన్ను ప్రార్థిస్తున్నాను. నా భవిష్యత్ నీ చేతుల్లో వుంది."

"మూర్తీ!" అంది నెమ్మదిగా.

"ఏం?"

"మనం పెళ్ళి చేసుకుంటే నీకు ఉద్యోగమే దొరక్కపోయేదా? ఇలా ఎందుకు చేశావ్? నువ్విలా నువ్విలా...." రాణీ ఏడ్వడం మొదలుపెట్టింది.

మూర్తికి రాణినీ ఎలా ఓదార్చాలో తెలియడంలేదు. అసలు రాణీ ఏడుస్తుందని కూడా అతను ఊహించలేదు. తనకి తెలియకుండా రాణీని గాయపరిచినట్టు అతనికి అర్థమవుతూనే ఉంది.

"మీ నాన్నగారన్నట్టు, ఆయన ఊహించినట్టు..." మూర్తికి మాటలు రావడంలేదు.

"నువ్వు నన్ను ప్రేమించావనుకున్నాను. ఎవరికీ భయపడకుండా

ఏ అవసరానికీ దాసోహం అనకుండా నావైపు నిలబడతావనుకున్నాను.''

మూర్తి నెమ్మదిగా అన్నాడు-

"నన్ను క్షమించు రాణీ! నేను ఏమీలేనివాణ్ణి. ఇంట్లో ఆకలి, చీదర. నా బ్రతుకుమీద పెరిగి పోతున్న నిరాశ, వీటినే నేను ప్రేమించాను. నువ్వు స్నేహితు రాలివైతే ఉద్యోగం దొరుకుతుం దన్న చిన్న కోరికే నా కళ్ళకి మసక వేయించింది. నిన్ను ప్రేమించడం, నీతో పెళ్ళి - ఇలాంటివన్నీ అత్యాశ అవుతాయనుకున్నాను. కానీ ఇలా....''

"కాదు, అంతా అబద్ధం. నీ సంగతి నాకు తెలుసు. మా నాన్న హోదాని చూసి బెదిరి పోయావు. నీకు ప్రేమకన్నా, నాకన్నా ఈవేళ ఉద్యోగం ముఖ్య మయింది. అంతే!''

మూర్తి నిరాశగా నవ్వేశాడు——

"నేను గుడ్డివాణ్ణి. బహూశా పుట్టు గుడ్డినేమో! నేను ప్రేమించలేదంటే మీ నాన్నగారు నమ్మలేదు. నువ్వూ అనుమానిస్తున్నావ్. నాకు ఇప్పుడు అన్పిస్తోంది - నిన్ను ప్రేమించి మీ రందరూ పెట్టే అగ్ని పరీక్షలకు నిలబడి నెగ్గితే ఎంత బాగుండునా అని. కానీ ఆలస్యం అయింది."

రాణి ఏడుస్తూనే ఉంది.

"రాణీ! ఇప్పుడు నువ్వు నా కళ్ళు తెరిపించావని అనడం వెర్రి తనం. జరిగిందేదో జరిగింది. ప్రేమించిన నీ కళ్ళలో నా మీద అభి మానాన్నీ, నిన్ను ప్రేమించానన్న క్రోధంతో మీ నాన్నగారి కళ్ళల్లో రగిలిన ఎరుపునీ-రెంటినీ చూశాను. ఈ అనుభవం చాలు. నిన్ను ప్రేమించేవాణ్ణి పెళ్ళాడు."

"అంటే నాన్న నీకు ఉద్యోగం ఇస్తాడని నమ్ముతున్నావా?''

"ఆయనకు నామీద అనుమానం ఉంది. భయం ఉంది. అందుకే ఉద్యోగం ఇస్తారు.''

ఇద్దరూ లేచారు. దారి పొడు గునా మూర్తి రాణీనీ ఓదారుస్తూనే ఉన్నాడు. తన్ను తను తిట్టుకుం టూనే ఉన్నాడు. మూర్తి చెప్పే సలహాలు, అమాయకత్వంతో-నిర్మ లంగా ఒడ్డుకుచేరే గోదావరి కెరటా ల్లాంటి మాటలు, రాణీనీ సేద దీరు స్తూనే, ఆమెలో ఆలోచనా రవళిని విప్పుతున్నాయి. ఇంటికి దగ్గరయిన తర్వాత అంది-

"మూర్తీ! మరి నేవెడుతున్నాను. కానీ, ఓ సంగతి- నీకు నేను ఓ కానుక ఇవ్వదల్చుకున్నాను''అంది.

"కానుకా!?"

"నేను నిన్ను ప్రేమించినం దుకు-తీసుకుంటావా?''

"నీ ఇష్టం."

"రేపు పంపిస్తాను."

"మరోవిషయం-నాన్నకి ఫోన్ చేసి 'ఎప్పాయింట్ మెంట్ ఆర్డర్స్ చేతిలో పడితేనే గాని రాణీ పెళ్ళి జరగనివ్వ'నని బెదిరించు. సరేనా?"

మూర్తి వింతగా చూశాడు రాణీనీ.

దగ్గరగా, చెయ్యి జాపితే అందే టంత దగ్గరగా నిలబడి ఉన్న రాణీ, మూర్తికి ప్రేమ మూర్తిగా కన బడింది. ఏదో ఆవేశం, ఓ ఉద్ధృతం అతనిలో నిప్పురవ్వని వెలిగించి నట్టయి రాణిని ఆ చీకట్లో దగ్గరకు తీసుకుని పెదాలపై ముద్దుపెట్టు కున్నాడు. ఆ తర్వాత తన చేతిమీద పడ్డ కన్నీటిబొట్టు వరంగా మిగుల్చు కుని ఇంటివైపు నడక మొదలు పెట్టాడు.

* * *

సుందరం తన హోదాకి తగ్గట్టు రాణీ పెళ్ళి చేశాడు.దానితో సుందరం గారికి ఆకాశం అందుకున్నంత ఆనందంగా ఉంది. ఒక్కగానొక్క కూతురికి తను ఊహించినవిధంగా పెళ్ళి జరగడం, తండ్రిగా ఆయనకు అందలం ఎక్కినట్టుగా ఉంది. కానీ ఆయన అందుకున్న ఆకాశం మీద కూడా మబ్బులు-ఆయన అందలం ఎక్కినప్పుడు కాలికి గుచ్చుకున్న ముళ్ళు-ఆయన మర్చిపోలేదు.

సుందరంగారు ఆనందంతో తన్మయత్వం అవుతూంటే మూర్తి గుర్తుకొస్తే వెగటుగా అన్పిస్తుంది. ఓ సాదా మనిషి ముందు ఓడిపోయి, తలవంచి కాళ్ళ బేరానికి దిగిన తన అవస్థ....సదా అహంకారంతో, విజయ గర్వంతో కళ్ళుఎత్తి చూసే మూర్తి మొహం, అతని అలికిడి, ఆయనకు నిత్యం సమ్మెటపోటులా విన్పిస్తోంది.

రాణీ పెళ్ళి అవ్వాలి.ఆ తర్వాత ఆ తర్వాత అనుకుని మనసును ఓదార్చుకుని తమాయించుకున్న సుందరంగారు, రాణీ పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్ళిన సాయంత్రం మూర్తిని పిలిచాడు. అప్పుడు ఐదు గంటలు దాటింది. ఆఫీసు అంతా నిశ్శబ్దంగా ఉంది. వెల్ ఫర్నిష్డ్ అఫీసు-సత్యభామ అలక గృహంలా ఉంది - ఎక్కడి ఫైల్ అక్కడే కనబడుతూ,చిందర వందర అయిన కుర్చీలతో.

సుందరంగారు మూర్తి మొహం చూశాడు. మూర్తి కూడా సుందరం గారి మొహం చూశాడు. సుందరం గారికి గడియారంచప్పుడు, మూర్తి బెదిరే గుండె చప్పుడులా విన్పించి చిరు దరహాసం వచ్చింది. అదే గడియారం చప్పుడు మూర్తికి

గంటక్రితం రైలు ఎక్కిన రాణీ మాటలకు కోడ్ రూపంగా విన్పించింది.

"రాణీ పెళ్ళి అయిపోయింది- నా కోరిక ఒకటి తీరింది."

"మీ కోరిక అదొక్కటేనా?" నెమ్మదిగా అడిగాడు.

"మరొకటి ఉంది...."

"మళ్ళీ ఫేరం ఆడ్డానికి పిలిచారా?"

"ఈ సారి ఫేరం కాదు-ఆజ్ఞాపన, శాసనం!"

"ఏమిటో అది?"

"నిన్ను రేపటినుంచి ఉద్యోగం లోంచి తొలగిస్తున్నాను."

మూర్తి తలెత్తి సుందరంగారి వైపు చూశాడు. వెంటనే అతనికి సర్కస్‌లోని రింగ్ మాస్టర్ గుర్తొచ్చాడు.

"ఈ నెలకు నీకు రావాల్సిన జీతం ఈ కవరులో ఉంది. ఇదిగో, ఈ కవరులో నిన్ను డిస్‌మిస్ చేస్తున్నట్టు దాఖలా ఉత్తరం ఉన్నాయి- తీసుకో!"—మూర్తి రెండు కవరులూ అందుకుని ఒకటి జేబులో పెట్టుకుని, మరొకటి సుందరం టేబుల్‌మీద పెట్టాడు.

"ఇది వాపసు తీసుకుందుకు మీరు మరేమన్నా ఫేరం పెట్టగలరేమో ఆఖరిసారి ఆలోచించండి సార్!"

"నా కింక నీతో పనిలేదు. నువ్వు వెళ్ళచ్చు."

"వెళ్ళకపోతే?"

"గెంటిస్తాను."

"నేను ఒకప్పటి మీ అమ్మాయి ప్రేమికుణ్ణి. నాకు భయపడకపోయినా నా మీద జాలి అయినా మీకు ఉండాలి."

"నీ మీదా—నీ మీద జాలా? నువ్వొట్టి ఫూల్‌వి. ఫూల్‌ని ఎలా సన్మానించాలో నాకు తెలుసు."

"నిజమే సార్! నేను ఫూల్‌ని నన్ను ప్రేమించిన అమ్మాయిని ప్రేమించలేని ఫూల్‌ని. నన్ను ప్రేమించినందుకు ప్రతిగా, ఆమెను ధైర్యం చేసి పెళ్ళి చేసుకోలేక పోయిన ఫూల్‌ని. కానీ ఒక

మాట సుందరంగారూ! పూల్‌ని చూపి మీరింకా భయపడుతున్నారు. అదే పూల్‌ని అసహ్యించుకుంటున్నారు. ఇది న్యాయమా....?"

"నాకు న్యాయా న్యాయాలతో పని లేదు...."

"అయితే నేను నిరుద్యోగిని కావాలంటారు మళ్ళీ."

"ఆఁ!"

మూర్తి ఏమనుకున్నాడో గబగబా తన డ్రాయరు దగ్గరకు వెళ్ళి దాన్ని తెరిచి, అందులోంచి బ్లూ రేపర్ తీసుకుని సుందరంగారి టేబిల్ మీద పడేసి చేతులు కట్టుకుని నిలబడి అన్నాడు—

"సుందరంగారూ! అదిగో, ఆ కట్ట విప్పండి. భయపడొద్దు.— అందులో టైం బాంబ్ లేదు. చక్కని సుతి మెత్తని చేతుల్తో రాణీ—మీ ముద్దుల కూతురు, నా ఒకనాటి ప్రేయసి వ్రాసిన ప్రేమ లేఖలు ఉన్నాయి. అవన్నీ నకళ్ళు మాత్రమే-అవి చదవండి. అలాంటి ఉత్తరాలు, అందునా ఒరిజినల్స్ నాలాంటి వాడి దగ్గర వుండడం క్షేమం అనుకుంటే, నేను మీకేమీ చెప్పలేను. నేను వెడుతున్నాను. ఈ ఉత్తరాలు చదివి, రేపు మీరు నాకు ఉదయం పది గంటలలోపు ఆహ్వానం పంపకపోతే ఏం జరిగేది నేను చెప్పలేను. నా ఉద్యోగం నాకు దక్కకపోతే రాణీ కూడా మీకు దక్కదు."

మూర్తి చివాలున వీధిలోకి వచ్చాడు. బయట చల్లనిగాలి ఒంటికి తగిలింది. మూర్తికి తన ఉద్యోగం పోతుందన్న భయం కలగలేదు, అసలు ఈ ఉద్యోగం పోకుండా గట్టి బంధం వేసిన రాణీ గుర్తుకు వచ్చింది....

"మా నాన్న సంగతి నీకు తెలియదు. ఇవిగో - పాత తారీఖులు వేసి, పది ప్రేమ లేఖలు నీ పేర రాసి ఉంచాను. ఎప్పుడైనా మా నాన్న నీకెదురు తిరిగితే వీటిని..."

మూర్తి తలక్రిందులయిపోయాడు ఆ రోజు. పెళ్ళి అయి వెళ్ళిపోతున్న ఓ స్నేహితురాలు తన స్నేహితుడి క్షేమం కోసం తన ఐదు ప్రాణాల్ని మూటగట్టి ఇస్తుంటే.... రాణీ ప్రేమికురాలనీ, స్నేహితురాలనీ తెలుసు. కాని మనసుకోసం బ్రతుకును కూడా లెఖ్ఖ చెయ్యని మనిషని తెలిసి - అటువంటి మనిషిని ప్రేమించనందుకూ, పొందనందుకూ, పెళ్ళి చేసుకోలేకపోయినందుకూ మూర్తి తనని తను తిట్టుకున్నాడు. పశ్చాత్తాపంతో కాగిపోయాడు. *